# సింగిల్ పేజీ కథలు

## కాశీవిశాలాక్షమ్మ

కాశీవిశాలాక్షమ్మ అనాథ శరణాలయ భవంతి ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త అర్జునరావుగారు అధ్యక్షత వహించిన పాండురంగారావుగారి కోరిక మేరకు జ్యోతి ప్రజ్వలనం చేసి ఆయనకు కేటాయించిన సోఫాలో ఆశీనులయ్యారు.

ముఖ్యంగా అధ్యక్షత వహించిన పాండురంగారావుగారు కాశీవిశాలాక్షమ్మ గారి గొప్పతనం గూర్చి తన ప్రసంగంలో చెప్పారు.

ఆవిడకు చిన్నప్పుడే వైధవ్యం సంప్రాప్తించింది. తనకు సంక్రమించిన పొలం, నగలతో అన్నయ్య ఇంటికి చేరింది. ఆవిడకు పిల్లలు లేరు. అన్నయ్య కూతురు అమృతను తన పిల్లలాగే ప్రేమతో చూసేది. తనకి కోపం అంటే ఏమిటో తెలియదు. ఎప్పుడైనా అన్నయ్య, వదిన కోపగించుకుంటే తనదే తప్పని సర్ది చెప్పేది. తన ఆస్తిని అన్నయ్యకు, మేనకోడలుకి ఇచ్చింది. కానీ ఆ విషయాలను ఎప్పుడూ ప్రస్తావించ లేదు. ఎప్పుడూ ఏదో పనిలో నిమగ్నమయ్యేది. ఖాళీగా కూర్చోటం తనకు తెలియదు. అన్నయ్య, వదిన కాలగమనం చేశారు. విధి వక్రించి తన మేనకోడలు కూడా తనువు చాలించింది. వయసు పెరగటం ఆగదు కదా! ఆవిడకు 85 సంవత్సరాలు నిండాయి. కానీ మానసికంగా ఆవిడ చాలా పదునుగా ఉండేది. మరపు చాలా తక్కువ.

ఆవిడను మేనకోడలు భర్త అనాథాశ్రమంలో చేర్పించాడు విజయవాడలో. దానికి ఆవిడ బాధపడలేదు. ఎందుకంటే అతనికి ప్రేమ, ఓర్పు లేదని తెలుసు. చాలా చురుకుగా ఆశ్రమంలో తిరుగుతూ తోటివారికి చాలా ఉత్సాహాన్ని నింపేది. పురాణగాథలని వినిపించేది. మిగిలిన ఆశ్రమవాసులు ఆవిడ సలహా సంప్రదింపులు తీసుకునేవారు.

ఒకనాడు పాండురంగారావుగారు తన తల్లిని ఆశ్రమంలో చేర్పించుదామని తీసుకువచ్చారు. అప్పుడు విశాలాక్షమ్మగారు ఆయనతో ఇలా అంది. "ఏం నాయనా ఇంట్లో ఎవరూ లేరా ఆవిడను చూసుకోవటానికి, ఆవిడకో ముద్ద పెట్టటానికి. కుక్కలని పెంచుతారు కదా!! కనీసం నీకు చిన్నప్పట్నుంచీ బాగోగులు చూసి పెంచిన తల్లి కుక్క విలువ చేయదా? నీకు ఎవరైనా ఫోను చేస్తే నీ గురించి చెపుతుంది కదా! ఎవరైనా ఇంటికొస్తే సమాధానం చెపుతుంది కదా! ఒక విధంగా ఆవిడను నీవు వాచ్‌ఉమెన్ అనుకోవచ్చు కదా. నీవు డబ్బుతో పెట్టుకునే వాళ్లు ప్రేమతో ఏ పని చేయరు. నీవు అన్నం పెట్టినా పెట్టకపోయినా ఆవిడ ప్రేమతోనే వ్యవహరిస్తుంది. నీ భార్య ఒప్పుకోకపోతే ఆవిడ వల్ల నీకు కలిగే లాభాలు చెప్పు. వింటుంది. ఆవిడ మాటలకు పాండురంగారావుగారు ఖిన్నుడై తన తల్లిని తిరిగి ఇంటికి తీసుకెళ్లిపోయాడు. ఆవిడ తన కళ్లు తెరిపించినందుకు చాలా సంతోషించాడు. అటు తర్వాత కాశీవిశాలాక్షమ్మగారిని చూడటానికి ఎప్పుడూ వచ్చి వెళుతుండేవాడు. ఆవిడ చివరి రోజుల్లో బట్టలు మార్చుకునే ఓపిక లేనప్పుడు ఆశ్రమ నిర్వాహకురాలు బట్టలు మార్చేది. "అమ్మా చిన్నపిల్లలకి డైపర్లు మారుస్తున్నట్టు నాకు బట్టలు మారుస్తున్నావు. నీకు ఏదైనా చేసే ఆర్థిక స్థోమత నాకు లేదు. వచ్చే జన్మలో నీకు తల్లినై రుణం తీర్చుకుంటాను" అని విశాలాక్షమ్మగారు అనేది.

ఆవిడ చనిపోయినప్పుడు, అంత్యక్రియలు నిర్వహించి, తన పేర ఆశ్రమం కట్టించటానికి పాండురంగారావుగారు నిర్ణయం తీసుకున్నారు. ప్రసంగం ముగిసింది. అర్జునరావుగారు ఒక్క ఉదుటున లేచి ఆవిడ ఫోటోను తేరిపార చూసి ఏడ్చారు. పాండురంగారావుగారు ఏమిటండీ అలా బాధ పడుతున్నారని అడిగితే "ఆవిడను ఆశ్రమంలో వదిలి వెళ్లిన దౌర్భాగ్యుడను నేనేనండి అన్నారు"

-పాణుకుమాటి సాంబమూర్తి
(విజయవాడ)

○○○

## పాటగాడు

'నారద సంగీత కళాశాల-ఇచ్చట సంగీతము నేర్పబడును. మరియు అన్ని టీవీ ఛానల్సు వారు నిర్వహించు పోటీలకు తర్ఫీదునివ్వబడును'

అడ్రసు కాగితం సరిచూసుకుని తన ఐదేళ్ల బుడతణ్ణి తీసుకుని ఆనందంగా లోపలికెళ్లాడు సుబ్బారావు.

"మనం ఎక్కడికొచ్చాం నాన్నా?" కొడుకు అడిగిన ప్రశ్నకి-

"నువ్వు సంగీతం నేర్చుకోవడానికి ఇక్కడ చేర్పించడానికి వచ్చాం నాన్నా. మరేం ఇక్కడ పాట నేర్చుకుని నువ్వు బోల్డంత పేరు తెచ్చుకోవాలి. సరేనా" పిల్లాడి వీపు మీద చిచ్చికొడుతూ ముద్దుగా వాడి భాషలోనే చెప్పాడు సుబ్బారావ్.

తండ్రి చెప్పిన మాట వాడికర్థం అయ్యిందో లేదో కానీ అక్కడున్న పిల్లల్ని ఆసక్తిగా గమనిస్తున్నాడు వాడు.

అదో పెద్ద హాలు. ఓ పక్కగా ఒక మాస్టారు పిల్లలకి సరిగమలు నేర్పిస్తున్నారు. ఇంకో చోట టీవీ ఛానల్సు వారు పెట్టే పోటీలకు తయారు చేయిస్తున్నట్టున్నారు మరో మాస్టారు. ఆయన పిల్లలకి పాట చెబుతూ "ఆహా, హా అలా కాదర్రా. మీరెప్పుడు గేదెలమ్మే సంత చూసుందరుకానీ, చూసుంటే ఈ పాట త్వరగా వచ్చేస్తుందర్రా. ఒకవేళ మీరక్కడ బేరం చేస్తున్నారనుకోండి. ఏమని అడుగుతారు? ఆగేదెట్టాగా ఈగేదట్టాగా అని. అంతే సింపుల్ పాట కూడా. 'ఆగేదెట్టాగా అందాకా ఏగేదెట్టాగా' అని పాడెయ్యటమే"

ఆయన అలా సినిమా పాటలని పిల్లలకి అర్థమయ్యేటట్లు రకరకాలుగా చెప్పడాన్ని చూసిన సుబ్బారావుకి గాల్లో తేలిపోతున్న ఫీలింగ్. ఇలాంటి చోటు కోసమే కొన్ని రోజులుగా వెదుకుతున్నాడాయె. త్వరలో తన కొడుకు కూడా 'సనిదపమ' అనే ప్రోగ్రాములో పాడి అశేష ఆంధ్ర బాలల్ని తోసిరాజని మొదటి స్థానంలో నిలబడి హైదరాబాద్‌లో అసెంబ్లీ ఎదురుగా ఉన్న రెండొందల గజాల స్థలాన్ని గిఫ్ట్‌గా కొట్టేసినట్టు ఈస్ట్మన్ కలర్‌లో డ్రీమ్స్‌లోకి వెళ్లబోతున్నప్పుడు అక్కడున్న రిసెప్షనిస్టు కాబోలు "అడ్మిషన్ కావాలా సార్" తియ్యని తేనెలూరు కంఠంతో.. వీణ తంత్రిని మీటినట్టుగా అడిగింది.

ఆ నాదానికి సుబ్బారావు ఉలిక్కిపడి అసెంబ్లీ నుంచి అమీర్‌పేటలోని సంగీత కళాశాల ప్రాంగణంలోకి వచ్చి "ఆ... మరేనండీ మా అబ్బాయిని చేరుద్దామని"

"అయితే అప్లికేషన్ పూర్తిచేసివ్వండి" అంటూ ఆఫీసు రూంలోకి దారి తీసింది.

అక్కడ సింహాసనాన్ని తలపించే కుర్చీలో ప్రిన్సిపాల్ కాబోసు ఠీవిగా కూర్చొని ఉంది. ఆమె ముందున్న టేబుల్‌పై నున్న నేమ్‌బోర్డు పరికించి చూశాడు సుబ్బారావు. 'శ్రీమతి వీణాధరి' ఎంత చక్కని పేరు. పేరుకు తగ్గట్టే పెద్ద విద్వాంసురాలయ్యుంటుంది. నా పెళ్లమూ ఉంది. పేరుకు సంగీత లక్ష్మి. కనీసం గురక కూడా శృతిలో పెట్టడం రాదు.

ఇలా ఆలోచిస్తున్న సుబ్బారావుతో "అబ్బాయి పేరు?" అడిగింది ఆవిడ. కోటి సీతారలు ఒకేసారి మీటిన ఫీలింగ్ సుబ్బారావులో. "త్యా... త్యాగరాజండీ..." తడబడుతూ చెప్పాడు.

'అబ్బో ఈ రోజుల్లో ఈ పేరు పెట్టుకునే వాళ్లూ ఉన్నారన్నమాట అనుకుంటూ' "అబ్బాయి వయసెంతండి?" అడిగిందావిడ.